క్లుప్తంగా

సమస్యలు పరిష్కారం కోరుతూ గిరిజనుల ర్యాలీ



నాగాయలంక:దశాబ్దాల తరబడి పరిష్కారానికి నోచుకోని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ యానాది మహానాడు ఆధ్వర్యంలో సోమవారం నాగాయలంకలో ర్యాలీ నిర్వహించారు. బోయ, వాల్మీకి, బెంతు, ఒరియా కులాలను ఎస్టీల్లో చేర్చవద్దని, రూ.3 లక్షల వరకు రుణాలు అందించాలని ర్యాలీకి నాయకత్వం వహించిన యానాది మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, ప్రధాన కార్యదర్శి నక్కా విజయబాబు కోరారు. ఈ సందర్భంగా స్థానిక మూడు రోడ్ల ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం తహసీల్దార్ జె.విమలకుమారికి వినతిపత్రం సమర్పించారు.

13 న మండల సర్వసభ్య సమావేశం

కృత్తివెన్ను:మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పిచ్చిబాబు తెలిపారు. ఎంపీపీ గరుడప్రసాద్ అధ్యక్షతను ఈ సమావేశం జరుగుతుందని సమావేశానికి మండల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండలాధికారులు హాజరుకావాలని కోరారు.

సత్యనారాయణకు సత్కారం



పెడన: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్యసేవలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేస్తున్న కొల్లూరి సత్యనారాయణ (చిన్నా)ను సోమవారం జిల్లాలోని పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు, ప్రముఖులు సత్కరించి అభినందించారు. ఇటీవల ఆయన గౌరవ డాక్టరేట్ పొందారు. ఈ నేపథ్యంలో స్థానిక వాసవి ప్రార్థన మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణా జిల్లా సంఘ నాయకులు సన్నిధి నాగసాయి, ఊర సురేంద్ర, వేముల కృష్ణ, కంతేటి పాండురంగ శ్రీధర్‌తో పాటు మచిలీపట్నం మండల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

గన్నవరం: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు ఉద్యమాలను తీవ్రతరం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక రాయ్‌నగర్‌లోని కల్యాణ మండపంలో సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం రెండో రోజు కూడా కొనసాగాయి. ముఖ్య అతిథి మూర్తి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేయడం దారుణమన్నారు. విదేశాల్లోని నల్లధనం తీసుకొచ్చి ప్రజలకు పంచుతామని ఇచ్చిన హామీని విస్మరించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంలోని సంస్థలను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా కలిసి వచ్చే ప్రజాస్వామ్యవాదులతో కమ్యూనిస్టు పార్టీలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్యామ్ సుందరం, సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు తాతయ్య, ప్రసాద్, పిచ్చియ్య, పెద్దు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- సర్వీసులను తనిఖీ చేసిన 40 బృందాలు
- రూ.4 లక్షల అపరాధ రుసుం వసూలు

గుడివాడరూరల్: విద్యుత్ చౌర్యం చట్ట రీత్యా నేరమని, చౌర్యానికి పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం 40 బృందాలుగా అధికారులు ఏర్పడి విద్యుత్ సర్వీస్‌లను తనిఖీ చేశారు. 1898గృహ సర్వీస్‌లు, 178 వాణిజ్య సముదాయాల సర్వీస్‌లు, 175ఆక్వా సర్వీస్‌లను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో 149 సర్వీస్‌లకు గాను అదనపు విద్యుత్ వినియోగం 192 కేడబ్ల్యూ మొత్తానికి వినియోగించనందుకు సర్వీస్‌లపై రూ.4 లక్షలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం జరిగినట్లు ఎక్కడైనా కన్పిస్తే 9440812362, 9440812363, 8331014951 నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఆయన కోరారు. ఈ తనిఖీల్లో గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ టి.రామకృష్ణ, గుడివాడటౌన్ డీఈఈ జి.వెంకటేశ్వర్లు, గుడివాడ రూరల్ విద్యుత్ ఏఈ సురేష్‌బాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పక్కాగా వైద్యం

- రూ. 9.35 కోట్లతో 11 నూతన భవనాలు
- వివిధ దశల్లో నిర్మాణాలు

మచిలీపట్నంటౌన్:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నాలుగేళ్లలోనే వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. గతంలో పేదలు వైద్య సేవలు పొందడానికి ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చేది. వైద్యులు, ఉద్యోగులు అందుబాటులో లేక రోగులు నానా అవస్థలు పడ్డారు. కానీ ఈ నాలుగేళ్లలో అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్లలో వచ్చిన మార్పులతో రోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. గతంలో వైద్యశాలలకు పది మంది రావటమే గగనంగా ఉండేది. ప్రస్తుతం అన్ని రకాల సేవలు అందుతుండటంతో 50 నుంచి 60 మంది రోగులు తరలివస్తున్నారు. కృష్ణా జిల్లాలో 13 అర్బన్ హెల్త్‌సెంటర్లు ఉన్నాయి. వీటిలో 11 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల సొంత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క భవనానికి రూ. 85 లక్షలు చొప్పున రూ. 9.35 కోట్లు మంజూరు చేసింది. ఈ నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. మచిలీపట్నంలోని వ్రైగూడెం, గుడివాడలోని బాపూజీనగర్ సెంటర్లకు సొంత భవనాలు ఉండగా మిగిలిన 11 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సెంటర్లకు సొంత భవనాలను ఒనగూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొద్ది నెలలుగా అర్బన్ హెల్త్‌సెంటర్ల పక్కా భవన నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. భవన నిర్మాణాలు పూర్తి కాగా ఎలక్ట్రికల్, ఫ్లోరింగ్, కాంపౌండ్



సిద్ధమవుతున్న శారదానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నూతన భవనం

లెవలింగ్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణం వంటివి చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే సొంత భవనాల్లోకి అర్బన్ హెల్త్‌సెంటర్లు మారనున్నాయి.

ముమ్మరంగా భవన నిర్మాణాలు

మచిలీపట్నంలోని గిలకలదిండిలో ప్రస్తుతం తుపాను షెల్టర్‌లో అర్బన్ హెల్త్‌సెంటర్ నిర్వహించటం జరుగుతోంది. దీనికి నూతన భవనం శ్లాబ్‌లెవల్‌కు చేరింది. శారదానగర్, రైలుపేట భవన నిర్మాణాలు పూర్తి కాగా మెరక, ఎలక్ట్రికల్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు చేయాల్సి ఉంది. నారాయణపురం భవనానికి నిధులు మంజూరైనా కోర్టు వివాదంతో నిర్మాణం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం అద్దె భవనంలోనే నిర్మాణం కొనసాగుతోంది. ఉయ్యూరు మునిసిపాలిటీ పరిధిలోని సెంటరుకు నూతన భవన నిర్మాణం పూర్తయింది. ఇంకా ప్లంబింగ్, ఉడెన్, ఎలక్ట్రికల్ పనులు జరగాల్సి ఉంది. గుడివాడ మునిసిపాలిటీ పరిధిలో బేతవోలులో శ్లాబ్ లెవల్‌కు చేరగా, స్లేడర్‌పేట భవనం కోర్టు వివాదంలో పనులు నిలిచాయి. దనియాలపేట, ఎన్‌టీఆర్ కాలనీల్లో నిర్మాణాలకు స్థల కేటాయింపు జరిగింది. భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. భవనాల నిర్మాణం పూర్తయితే సొంత భవనాల్లోకి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు మారి రోగులకు మరిన్ని



ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న శారదానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

మెరుగైన వైద్యసేవలు అందించనున్నాయి. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందడంపై హర్షం వ్యక్తమవుతోంది.

త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు



అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల నిర్వహణకు సొంత భవనాల నిర్మాణ పనులు త్వరగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అద్దె భవనాల్లో ఉంటున్న సెంటర్లను భవన నిర్మాణం పూర్తయితే వాటిలోకి మారుస్తాం. పెరిగిన వైద్య సదుపాయాలతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. 172 మందులతో పాటు, 60 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నాం. సొంత భవనాలు అందుబాటులోకి వస్తే విశాలమైన గదుల్లో రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందిస్తాం.
జి.గీతాబాయి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

అందరికీ ఆధునిక విద్య అందేలా కృషి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

నాగాయలంక:ఆర్థిక అసమానతలు రూపమాపాలనే అత్యున్నత లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధునిక విద్య అందరికీ అందించేలా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి అమ్మఒడి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగాయలంక మండలంలోని 51 పాఠశాలల్లో 3,541 మంది విద్యార్థులకు రూ.5,31,15,000 అమ్మఒడి నిధులు కేటాయించినట్లు తెలిపారు. స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి), పాలెం సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, తోట సాయిబాబు, మండల పరిషత్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, తహసీల్దార్ జె.విమలకుమారి, మండల విద్యాశాఖాధికారి టీవీఎం రామదాసు, ఎంఈఓ–2 అన్నపరెడ్డి రామారావు, వెలుగు ఏపీఎం కె.వై.దాస్, సీఆర్‌పీలు, బాలబాలికల తల్లులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

పవన్‌కళ్యాణ్ చిత్రపటాలు దహనం

పెడన:అనుచితంగా మాట్లాడిన పవన్ కల్యాణ్ తక్షణం క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం సామూహిక మానవహారం నిర్వహించి పవన్‌కల్యాణ్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పవన్ చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ సమస్యలను అధిగమించడానికి ఖాళీగా ఉన్న యువతకు ఉద్యోగ అవకాశం కల్పించారని చెప్పారు. పేదలకు సేవ చేస్తున్న వారిని అవమానపరిచే విధంగా కించపరిచి మాట్లాడటం తగదన్నారు. కరోనా కష్టకాల సమయంలో సైతం ప్రజలకు విశేష సేవలను అందించిన ఘనత వలంటీర్లదని చెప్పారు. అటువంటి వలంటీర్లను పట్టుకుని మహిళలను అక్రమ రవాణా చేస్తున్నారని పేర్కొనడం దారుణమన్నారు. స్థానికంగా ఉంటున్న సమాచార మాధ్యమాలకు, టీవీలకు, పత్రికలకు, పోలీసుల వారికి తెలియకుండా కేవలం కేంద్రంలోని నిఘావర్గాలు పవన్‌కు మాత్రమే తెలియజేశారనడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో వలంటీర్ల సేవలను తెలుసుకోకుండా ఎవరో ఏదో చెబితే దానినే వల్లించడం పవన్‌కు మాత్రమే తెలుసునని ధ్వజమెత్తారు. పవన్ కల్యాణ్ భేషరతుగా వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మతీన్‌ఖాన్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు మాటలు వెనక్కి తీసుకోవాలి

నాగాయలంక: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అవగాహన లేమి, రాజకీయ అజ్ఞానంతో మహిళలను సైతం అవమానపరుస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్టేట్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు మాట్లాడారు. ఏలూరు సభలో పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై దిగజారుడు వాఖ్యలు చేయడం ఆయన పతనాన్ని చూపుతుందని ధ్వజమెత్తారు. కుళ్లు రాజకీయాల కోసం వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తే కనుమరుగు కాక తప్పదని హెచ్చరించారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా మహమ్మారి కాలంలో వలంటీర్లు విశేషమైన సేవలు అందించారని చెప్పారు. రాజకీయ అజ్ఞానవాసిలాగా అసంబద్ధ, అవగాహన రహిత ఆరోపణలు చేసే పవన్‌ను ప్రజలే తరిమి కొడతారని తెలిపారు. ఆయన దిగజారుడు మాటలు తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వలంటీర్లు ఆగ్రహం..

కృత్తివెన్ను:జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మనోభావాలు దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలపై మండలంలోని వలంటీర్‌లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువ వేతనంతో సమాజసేవ చేస్తున్న పవిత్రమైన వలంటీర్ వ్యవస్థను రాజకీయ లబ్ధికోసం దూషించడం పెద్ద నేరమన్నారు. దీనికి గాను పవన్‌కళ్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పడంతో పాటు తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పవన్ కల్యాణ్ చిత్రపటాలు దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం



పెడన మున్సిపల్ కార్యాలయం వద్ద మానవహారంగా నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు



పెడనలో పవన్ కళ్యాణ్ చిత్రపటాలు దహనం చేస్తున్న వలంటీర్లు

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

జిల్లా ఎస్పీ పి.జాషువ

కోనేరుసెంటర్: స్పందనలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ పి.జాషువ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పందన హాల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ బాధితుల నుంచి అర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు న్యాయం కోసం ధైర్యంగా స్పందనను ఆశ్రయించవచ్చని చెప్పారు. అర్జీ అందుకున్న అనతి సమయంలోనే బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

అందిన అర్జీలు....

- గుడ్లవల్లేరుకు చెందిన రాజులపాటి విజయలక్ష్మి తన చిన్న కుమారుడు తాపీ పని చేస్తుంటాడని, గుమ్మడి స్వాతి అనే ఆమె తాపీ పనులు చేస్తుంటుందని తెలిపింది. స్వాతి తన కుమారుడి ఫోన్‌పేకు ఆమె బంధువులు నగదు పంపినట్లు చెప్పగా తన కుమారుడి ఫోన్‌పేకు ఎటువంటి నగదు జమ కాలేదని చెప్పింది. అయినప్పటికీ స్వాతి డబ్బులు ఇవ్వకుంటే అందరిలో పెట్టి తమ పరువు తీస్తానంటూ బెదిరిస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలు తీసుకుని తమ పరువును కాపాడాలని కోరింది.
- మచిలీపట్నం గాంధీనగర్‌కు చెందిన శ్రావణం కుసుమకుమారి తనకు ఇద్దరు మగపిల్లలు కాగా చిన్న కుమారుడి వద్ద ఉంటున్నట్లు చెప్పింది. కొడుకు, కోడలు తన ఆస్తికి సంబంధించిన దస్తావేజులు బలవంతంగా తీసుకుని తనను మానసికంగా, శారీరకంగా బాధపెడుతున్నారంటూ వాపోయింది. తన డబ్బు తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోవాలంటూ వేధిస్తున్నారని వారిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరింది.
- మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన పోసిన నాగభవాని స్పందనలో ఎస్పీని కలిసి 2020లో కొట్టి మహేష్ అనే అతనిని ప్రేమ వివాహం చేసుకున్నట్లు చెప్పింది. పెద్దలు ఒప్పందం కుదిర్చి అత్తింటికి పంపినట్లు తెలిపింది. కట్నకానుకల కింద రూ.ఐదు లక్షలు, బంగారం పుట్టింటి వాళ్లు అందజేయగా భర్త, అత్తామామలు అదనపు కట్నం కోసం తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని కన్నీరు పెట్టుకుంది. కులం పేరుతో దూషిస్తూ మరింత వేదనకు గురి చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరింది. బాధితుల అర్జీలపై స్పందించిన ఎస్పీ సంబంధిత అధికారులకు వాటిని సిఫార్సు చేశారు. తక్షణమే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్.హరిబాబు పాల్గొన్నారు.



స్పందనలో బాధితుల నుంచి అర్జీలు అందుకుంటున్న ఎస్పీ పి.జాషువ

కుండపోత వర్షం.. రైతుల్లో హర్షం



పెడన మండలం కొంకేపూడి వద్ద మొలకలు వచ్చిన పంట పొలాల్లో నిలిచిన వర్షం నీరు

పెడన:పెడనలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు రైతుల పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమైనా నాలుగైదు గంటలకు నీరంతా డ్రైయిన్లు ద్వారా బయటకు పోయాయి. మరో పక్క కొంకేపూడి, నడుపూరు, కూడూరు, నందిగామ, పెనుమల్లి, నేలకొండపల్లి, బలిపర్రు, నందమూరు, కాకర్లమూడి తదితర గ్రామాల్లోని పంట చేలలో వర్షం నీరు నిలిచింది. ఇప్పటికే రైతులు తమ పంటల్లో వెదసాగు ద్వారా విత్తనాలు జల్లుకుని సిద్ధంగా ఉన్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే మొలకలు వచ్చాయి. మొలకలు వచ్చిన చోట వర్షం నీరు ఉండటంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా విత్తనాలు జల్లిన చోట నీరు నిల్వలేకుండా చూసుకుంటున్నారు. సోమవారం కురిసిన కుండపోత వర్షం రైతులకు మేలు చేసిందని అంటున్నారు.



చేలల్లో నిలిచిన వర్షం నీరు

స్విమ్మింగ్‌లో సెయింట్‌జాన్స్ విద్యార్థికి పతకాలు



గన్నవరం: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో స్థానిక వీఎస్ సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థి పి.రామచంద్రరావు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో రామచంద్రరావు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 8, 9 తేదీల్లో నరసరావుపేటలో పల్నాడు జిల్లా ఆక్వటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలు జరిగాయన్నారు. 100 మీటర్ల జూనియర్ కేటగిరిలో రామచంద్రరావు ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, 50 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అనంతరం రామచంద్రరావును ప్రిన్సిపాల్‌తో పాటు సీనియర్ బ్రదర్లు జిమ్మికురియోకోస్, భల్లా జోసఫ్, జయబాలన్, ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

పెడన:అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని పెనుమల్లి గ్రామ సచివాలయం, పట్టణంలోని ఐదో సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. పెనుమల్లిలో నిర్వహించిన క్యాంపులో వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్చుతరావు పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ జగనన్న పేదలకు చేస్తున్న సేవలను వివరించారు. సేవ చేసే వారిని మరిచిపోవద్దని కోరారు. 250 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పెనుమల్లి, నేలకొండపల్లి సర్పంచులు గరికిపాటి వెంకటరామానాయుడు, వూచా సత్యనారాయణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు దావు భైరవలింగం, తహసీల్దారు మధుసూధనరావు, ఎంపీడీవో రెడ్డయ్య, ఈవోపీఆర్డీ జయరాము, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు. ఐదో సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.మహేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్ ఖాదర్ జిలానీ, బళ్ల సాంబశివరావు, టీపీవో ఏసుబాబు, జేసీఎస్ ఇన్‌చార్జి ఎండీ మతీన్‌ఖాన్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. లబ్ధిదారులకు 157 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.



పెడనలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న కమిషనర్ మహేంద్ర తదితరులు

బెరాకా మినిస్ట్రీస్ సహాయం అభినందనీయం

చిలకలపూడి(మచిలీపట్నం):బెరాకా మినిస్ట్రీస్ పేదలకు, విద్యార్థులకు అందిస్తున్న ఆర్థిక సాయం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. పేద విద్యార్థులకు, వైద్య సహాయం నిమిత్తం, ఇళ్ల నిర్మాణం కోసం రూ.9,55,510 సాయం అందించారు. కలెక్టరేట్‌లో డీఆర్వో చేతుల మీదుగా సోమవారం 33 మందికి చెక్కులు పంపిణీ చేశారు. 21 మంది విద్యార్థులకు రూ. 5,21,945, వైద్య సహాయం కోసం ఎనిమిది మందికి రూ. 88 వేలు, ఇళ్ల నిర్మాణం కోసం నలుగురికి రూ. 3,46,545 అందజేశారు. డీఆర్వో మాట్లాడుతూ పేదల కోసం బెరాకా మినిస్ట్రీస్ ఎంతో తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. దీని ద్వారా విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, బెరాకా మినిస్ట్రీస్ అధ్యక్షుడు కిరణ్‌పాల్, ఉపాధ్యక్షుడు తిరుమాని వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఆకూరి ప్రభుదేవ, కాగిత రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



వైద్యసహాయం నిమిత్తం చెక్కును అందజేస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

ఉపాధి పనులపై ఫిర్యాదు

బంటుమిల్లి: మండల పరిధిలోని కొర్లపాడు గ్రామ పరిధిలో గత సంవత్సరం జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు ఉపాధి కూలీలు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకం పనులపై గ్రామంలో గత రెండు రోజులుగా సామాజిక తనిఖీ బృందం పనులను పరిశీలించింది. సోమవారం సర్పంచ్ అట్లూరి రమేష్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో గత సంవత్సరం జరిగిన పనుల్లో నిధులు దుర్వినియోగం, రికార్డుల అవకతవకలపై రెండు వర్గాల మధ్య గొడవలు తలెత్తాయి. దీనిపై పనులు పరిశీలించిన డీఆర్పీ అప్పారావు కూలీలను విచారించామని తెలిపారు. వారు పనుల్లో పాల్గొన్నట్లు చెప్పారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు:విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎమర్జెన్సీ వర్క్ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ కోత విధించనున్నట్లు ఆ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 33 కేవీకి సంబంధించి ఏబీ స్విచ్చులను మార్చడంతో పాటు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. దీంతో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కోడూరు, దింటిమెరక, ఇస్మాయిల్‌బేగ్‌పేట, నాయుడుపేట, వేటపాలెం, కృష్ణాపురం, నరసింహపురం, జయపురం, స్వతంత్రపురం, హరిపురం, నక్కవానిదారి, ఉల్లిపాలెం, జరుగువానిపాలెం, హంసలదీవి, వేణుగోపాలపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు చెప్పారు.

ఆక్వా రంగంలో మెలకువలపై అవగాహన

పెదకళ్లేపల్లి(మోపిదేవి):ఆక్వా సాగులో మెలకువలపై రైతులు ముందుగా అవగాహన కలిగి ఉండాలని ప్రొవెట్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ రీజనల్ సేల్స్ మేనేజర్ కట్టా సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో నేషనల్ ఫిష్ ఫార్మర్స్ డే సందర్భంగా సోమవారం ఆక్వా సాగు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా సాగులో ఎదురయ్యే సమస్యలు, మెలకువలు గురించి వివరించారు. మచిలీపట్నం ఏరియా కో–ఆర్డినేటర్ దేవరకొండ వసంత్, ఆక్వా రైతులు దాసరి శివ, అడపా రాంబాబు, సుంకర నాగేశ్వరావు, రెడ్రౌతు వెంకటేశ్వరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలి

ఉంగుటూరు: ఎరువుల దుకాణాల డీలర్లు తప్పనిసరిగా ఈ పోస్ యంత్రం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని గన్నవరం ఏడీఏ సునీల్ స్పష్టంచేశారు. ఉంగుటూరులోని ఆర్‌బీకేలో మండలంలోని ఎరువుల డీలర్లు, పీఏసీఎస్ ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. లైసెన్స్ గడువు పూర్తయిన వారు రెన్యూవల్ చేసిన తరువాతే ఎరువులు విక్రయించాలని సూచించారు.